


# పారితోషికం

— గోవిందరాజు సీతాదేవి

తనూజకి భర్తకి ప్రమోషన్‌వచ్చినందుకు సంతోషంగానే వుంది. కానీ "ట్రాన్స్‌ఫర్" అయి ఓ అరణ్యం మధ్యలోవున్న వూరుకి వెళ్ళవలసి వచ్చిందే అని తగని దిగులుగా వుంది. మధుసూదన్ అసిస్టెంట్ ఇంజనీర్ నుంచి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ప్రమోట్ అయ్యాడు. దిగులుపడే; భార్యని అనునయిస్తూ మధుసూదన్.

"మరేం భయపడకు మనం వెళ్ళేది

"ప్రాజెక్టు" ప్రాంతం కదూ. నీ కాల క్షేపానికి లేడీస్ క్లబ్బు వుంది. నాకు టెన్నిస్ కోర్టు వుంది. యింకేం కావాలి" అన్నా తనూజ జవాబివ్వలేదు. దిగులుగా వుంది మనస్సులో.

"తనూ నీలాంటి మితభాషులకి ఇంక కాలక్షేపంకాదు. అన్న బాధ వుండదుగా రేడియో పుస్తకాలూ లైబ్రరీ "ఫిడేలూ" వగైరా చాలుగా" అన్నాడు నవ్వుతూ.

"అయినా కూడా నాకు దిగులుగా వుంది" అంది భర్తతో.

"మరేం దిగులుపడకు, మనం అక్కడికి వెళ్ళగానే ఏదో ఒక చిన్న కారణంతో కొందర్ని పిల్చి 'టీ పార్టీ' అరేంజ్ చేస్తే చాలు అందరూ పరిచయం అయిపోతారు" తేలిగ్గా అనేసి అక్కడనుంచి వెళ్ళిపోతూన్న భర్తని చూస్తూ అలాగే కూర్చుండిపోయింది తనూజ. ఇంతలో తన ప్రక్క ఇంటి కాత్యాయిని వచ్చింది. ఆ ఇద్దరికీ ప్రాణ స్నేహితం అయింది యీ మధ్యనే. ఆమెని వదిలి దూరంగా వెళ్ళాలి తప్పదు అన్న ఆలోచన వచ్చి కళ్ళలో నీళ్ళు తిరిగాయి తనూజకి

"ఈ సాయంకాలం మా ఇంటికి పార్టీకి రావాలి నువ్వు తనూజా! మరి కొందర్ని కూడా పిల్చాను. సరిగా ఆరు గంటలకి వచ్చేయి" అంటూన్న కాత్యాయిని కంఠం బొంగురుపోయింది.

"ఇప్పు డివన్నీ యెందుకు వద్దు" అన్నా వినలేదు. తనూజ సాయంకాలం పార్టీకి వెళ్ళక తప్పలేదు. పార్టీ సింపుల్గా చేసినా కాత్యాయని ఆత్మీయతకి కరిగిపోయింది తనూజ. తిరిగి ఇంటికి వస్తూంటే "వెళ్ళగానే కొత్త వూరూ, కొత్త స్నేహితులలో నన్ను మర్చిపోక ఉత్తరం రాస్తావు కదూ" అంది. "నిన్ను మర్చిపోవటమా?" అని ఆమె చెయ్యి నొక్కి వదిలి "తప్పక రాస్తాను" అనేసి వచ్చేసింది. అప్పుడే మదుసూదన్ కూడా ఆఫీసు వాళ్ళిచ్చిన పార్టీ అయి తిరిగి ఇల్లు చేరాడు. ఇద్దరూ మౌనంగా వున్నారు.

కాత్యాయని తనకి గుర్తుగా యిచ్చిన ఫ్లవర్వాజ్ని భద్రంగా దాచి రైలెక్కింది తనూజ భర్తతో సహా. మధుసూదన్ అన్నాడు మనం యింతగా బాధపడితే ఎలాగోయ్. వుద్యోగం అన్నతర్వాత ట్రాన్సఫర్లు తప్పవు మరి. అసలు జీవితం అంటే రైలు ప్రయాణం లాంటిది అని నీవే చెప్తూంటావుగా. అంటూ నవ్వేశాడు. కానీ తన ఆఫీసులోని వాళ్ళువచ్చి వీడ్కోలు చెప్తూంటే అతని కళ్ళలో నీళ్ళు తిరగటం గమనించకపోలేదు తనూజ. రైలు మాత్రం తన డ్యూటీని నిర్వర్తిస్తూ వేగాన్ని అందుకుంది.

తనూజ కొత్తవూరూ, కొత్తఇల్లూ, కొత్త నౌకర్లతో అలవాటు అయేసరికి

వారం పట్టింది. ఇల్లు చాలా సౌకర్యంగా వుందని అనుకుంది. పెరట్లో మామిడి, నిమ్మ అరటి జామ వగైరా చెట్లు ముందువైపు అన్ని రకాల పూవుల మొక్కలూ వున్నాయి. మేడపై భాగంలో రెండు గదులు. అబ్బ యింత పెద్ద యిల్లు యెందుకు ఇద్దరికి అనుకుంది. వంటకి మిగతా పనులకీ నౌకర్లు ఒక్కసారి చెప్తే చాలు అక్షరాలా అలాగే చేసేసి అతివినయం ప్రదర్శిస్తూ వుండే-వాళ్ళని చూస్తూ అమ్మయ్య అనుకుంది. కానీ కాలం అతిమెల్లగా గడుస్తూన్నట్లు అయి విసుగు యెక్కువైంది. మధుసూదనే స్నేహితులనిపిలిచి చిన్న పార్టీయిచ్చాడు అతని స్నేహితులేకాక వారి భార్యలని కూడా తనూజకి పరిచయం చేశాడు.

ఒకామె M· A. అట పేరు చారుమతి ఇద్దరే పిల్లలు అందంగానే వుంది. అతిక్లుప్తంగా మాట్లాడుతుంది, మరొకామె శారద అలంకరణ యెబ్బెట్టుగా వుంది.నన్నగా పొట్టిగావుండి హైహీల్సు వేసుకుని నడుస్తూ అతిగావాగుతు 'బోర్' అనిపించింది. అర్థగంటలోనే మరో ఇద్దరు వచ్చారుకానీ వాళ్ళు తనూజతో మాట్లాడటానికి భయపడి యెలాగో పార్టీ అయిపోయిన వెంటనే వెళ్ళిపోయారు.

వీళ్ళందరినీ చూస్తూంటే తనూజకి విసుగూ నవ్వూ వచ్చింది. భర్తకి భోజనం వడ్డిస్తూ "యీ వూళ్ళో యెన్నాళ్ళుండాలి మనం" అంది. పీరియేసగా ముఖం పెట్టుకుని "ఎందుకు" అన్నాడు నవ్వుతూ భార్యముఖంలోకి చూస్తూనే.

"చెప్పండి" రెట్టించింది.

"పుట్టింటికి ప్రయాణం కడతావా"

"కాదు హిమాలయాల్లోకి వెళ్ళి మీకు మరో వూరు బదిలీఅయినతర్వాత తిరిగివస్తాను సరేనా" అంది అసహనంగా.

మధుసూదనే విరగబడి నవ్వి "యీ భారతదేశంలో యే మూల యెక్కడికి వేసినా వెళ్ళిపోయి అక్కడి ప్రజలతో కల్సి బ్రతకటం అలవాటు చేసుకోవాలి కానీ నా తాలూకా, నా జిల్లా, నా రాష్ట్రం అంటూ వూరి పొలిమేరలు వదలని మన సత్వం వున్నంత వరకూ మన ఆంధ్రులు బాగుపడరుకాక పడరు" వుపన్యాస ధోరణిలో అనేస్తుంటే తనూజ "సారీ యిప్పటి సమస్య మీది కాదు నాది నేను నిరుద్యోగిని" అంది.

"నీ సమస్యే అనుకో. నీకు యే వూరు వెళ్ళినా ఆ కాత్యాయినులే యెలా వస్తారోయ్. ఇక్కడ మన చుట్టూ వున్న వాళ్ళు మనుష్యులు కారూ" అన్నాడు కోపంగా చూస్తూ. తనూజ యింక మాట్లాడలేదు. తనూ భోజనం పూర్తి చేసి రేడియోలో హిందీ పాటలు వింటూ యీజీచెయిర్‌లో అలా ఆరుబైట కూర్చుంది పోయింది. తన కాలేజీ

జీవితం ఆ తర్వాత మధుసూదన్‌తో పెళ్ళి కొత్త కాపురం స్నేహితులూ గుర్తుకొస్తున్నారు. అప్పుడే పెళ్ళి అయి నాలుగు సంవత్సరాలు అయిపోయింది. పిల్లలు కావాలి" అని త్వరపడే భర్తతో" అబ్బ అప్పుడేనా అనేసి ఆ విషయంలో తన నిర్ణయాన్నే అమలుచేస్తూ యిన్నాళ్లు గడిపేసింది. కానీ అందం చదువూ వుద్యోగం హోదావున్న భర్తా ఇల్లూ నౌకర్లూఅన్నీ వున్నా మనస్సుకి ఏదో వంటరితనం అన్పిస్తూ వుంటుంది. తనూజకి ఈ బాధ యీ వూరు వచ్చిన తర్వాత మరీ వేధిస్తోంది. యిది తప్పించుకుని ఇంకేవో ఆలోచిస్తూండేది.

అప్పుడప్పుడూ తన ఆలోచనలని కాయితంమీద పెడుతూండేసరికి అవి కథలుగా తయారు అవుతూ వుండేవి. అవి అప్పుడప్పుడూ మళ్ళీ చదువుకుని.

"అరె యివి నేను రాసినవేనా! నిజంగా నాలో యిన్ని భావాలు వున్నాయా" అనుకుని ఆశ్చర్యపోతూ వుంటుంది. ఆశ్చర్యమైన విషయం ఏమంటే ఈ రాయాలనే వుద్దేశ్యం అశాంతిలో నేకాక సంతోషం లోనూ ఏదైనా బాధాకరమైన విషయం చూసినా విన్నా చదివినా తనూజ మెదడులో తుఫాను ప్రారంభం అయ్యేది. కాయితం మీద పెడితే వాటికి క్రమ పద్ధతి వచ్చేది. అయితే దానికి నగిషీ చెక్కటం మాత్రం తనూజకి చేతకావటంలేదు. యీ విషయం ఓ సారి భర్తతో అంటే అతను సరిగా వినకుండానే......

"ప్రతి మనిషి మేధస్సులో నూ యీలాంటి సంచలనం వుండి తీరుతుంది అనుకుంటాను. అయినా నాకు ఆ విషయాలు తెలియవు." అన్నాడు.

"మీకు మనుషులని గురించికన్నా మిషన్ల గురించే బాగా తెల్సు కదూ" అంది అక్కసుగా."

"యస్. ఒప్పుకుంటూన్నాను" అనేసి కాఫీ తాగేసి అలాగే క్లబ్బుకి వెళ్ళి కాస్సేపు టెన్నిస్ ఆడి రాత్రి తొమ్మిదికి గానీ ఇల్లు చేరడు మధుసూదన్.

తనూజ పెరటి తోట పర్యవేక్షణ చేసి తోటమాలికి యే యే పాదులకి పందిళ్ళు వెయ్యాలో చెప్పి లోపలికి వచ్చి నాయర్‌కి వంటకాల వివరాలు చెప్పి యింక హాలులో కివచ్చి సోఫాలో కూర్చుని 'లత' మోహన వంశీ తీసుకుని నాలుగోసారి చదువుతూ టైము యెంత అయింది అనుకుంటూ గోడగడియారం వైపు చూసింది.

"పదకొండు. అబ్బ యింతేనా" వొంటి గంటకిగానీ మధుసూదన్ భోజనానికి రాడు, అనుకుంటూ తిరిగి పుస్తకం తెరుస్తూండగా

ఓ ఇరవైయేళ్ళ అబ్బాయి తెల్ల పాంటూ నీలంగళ్ళ షర్టు వేసుకుని మెల్లగా అక్కడికి రాబోయి కర్టెన్

దగ్గరే ఆగి "అమ్మగారూ ఉత్తరాలు ఇచ్చి రమ్మన్నారు అయ్యగారు" అంటూ నిల్చున్నాడు

"యిలా యివ్వు" అన్న తర్వాత అతను వచ్చి నమస్కారం చేసి రెండు కవర్లు అందించాడు. "నువ్వు" అర్ధోక్తిలో ఆగి పోయింది. ప్యూనులా లేడు అనుకుంటూ. "నేను అటెండర్ చేస్తున్నాను. పేరు 'చంద్ర'" అన్నాడు కానీ అతని కళ్ళు మాత్రం తనూజ చేతిలోని పుస్తకం మీదే వున్నాయి. చంద్ర పేరు బాగుంది. అలాగే ఇతని ముఖం బాగుంది. కానీ పేదతనం ముఖంలో లేదు బట్టల్లో వుంది అనుకుంది. చంద్రవి కళ్లు చిన్నవే అయినా ఏదో చెప్పలేని ఆకర్షణగా వున్నాయి. ఇతని రంగు కూడా నలుపు కాదు. అలాగని తెలుపూ కాదు అనుకుంటూ అతన్నే చూస్తూ వుండిపోయింది ఓ నిమిషం. అంతలోనే 'ఛీ' అనుకుని ముఖం తిప్పుకుని పుస్తకం ప్రక్కకి పెట్టి వుత్తరాలు తీసుకుంది.

"వస్తానండీ" అనేసి చంద్రం వెళ్ళిపోయాడు. ఇంటి అడ్రస్ ఇచ్చినా సామాన్యంగా పోస్టాఫీసుకి వెళ్ళిన ఆఫీసు ప్యూనుకే యీ వుత్తరాలు ఇచ్చేస్తుంటాడు పోస్టుమెన్. ఈ విషయం కోపం వస్తూన్నా పోనివ్వు. లెటరు త్వరగా చూసుకోవచ్చు అనుకుంటుంది తనూజ.

ఒకటి కాత్యాయని రాసింది. మరోటి తండ్రి దగ్గరనుంచి. ఉత్తరాలు వచ్చిన రోజున సంతోషంగా వుంటుంది. అసలు యీ వూరు వచ్చిన తర్వాత వుత్తరాలు రాయటంలో వున్న బద్ధకం వదిలి ప్రతి వాళ్ళకీ రాసేస్తోంది.

ఇలాగే కాలక్షేపం కాక యీమధ్య రెండు కథలు కూడా వారపత్రికలకి పంపింది, తన ఇంటి అడ్రెస్ యిచ్చి. ఆ కథలు పడతాయో, తిరిగి వచ్చేస్తాయో అని ఆలోచిస్తూ తనలో తనే నవ్వుకుంటూ తిరిగి పుస్తకం తీసుకుంది తనూజ. ఇంతలో ఫోను గణగణా శబ్దం కావటంతో లేచి వెళ్ళి అందుకుంది.

అవతల నించి మధుసూదన్ గొంతు వినిపిస్తోంది. "చాలా అర్జెంట్ వర్క్ వుంది. క్యారియర్ పంపు. సాయంకాలం త్వరగా వచ్చేస్తాను. అలా సినీమాకి వెడదాం" అనేసి జవాబు కోసం ఆగకుండానే పెట్టేసిన శబ్దం విని 'అబ్బ' అనుకుంటూ నిట్టూరుస్తూ రిసీవర్ పెట్టేసి తనింక భోజనం చేసేందుకు లోపలికి వెళ్ళింది.

## 2

సాయంకాలం టిఫినూ టీ తయారు చేయించి భర్త రాక కోసం యెదురు చూసింది తనూజ. గడియారం అయిదూ ఆరూ అంటూ గంట చూపిస్తోంది ఛీ యీలాంటి ఆఫీసరు భార్యగా కన్నా

హాయిగా యస్జీవో భార్య అయివుంటే యెంత బాగుండేది అనుకుంది కోపంగా. యింతలో 'చంద్ర' కొన్ని ఫైల్సూ తాళం చెవులూ తెచ్చి అక్కడ పెట్టి వెళ్ళిపోతూంటే తనూజ "మీ అయ్య గారు వస్తున్నారా" అంది.

"క్లబ్‌కి వెళ్ళారు" తల యెత్తకుండానే జవాబిచ్చాడు. పొద్దున చూసిన ముఖమే అయినా మళ్ళీ అతని ముఖం లోకి పరీక్షగా చూస్తోంది తనూజ.

"క్లబ్‌కి ఫోనువుందా" అంది.

"వుంది. నంబరు—"

"అక్కరలేదు కానీ నువ్వు వెళ్ళి అయ్యగార్ని అర్జెంటుగా రమ్మని పిల్చుకురా".

"అలాగేనండి" వెళ్ళిపోయాడు చంద్ర.

చంద్రని పంపింది కానీ భర్తవచ్చి ఏం కోపగించుకుంటాడో అని లోలోపల భయంగానే వుంది. 'ఫర్లేదులే' అనుకుని గబగబా డ్రెస్ అయి మరోసారి ముఖాన్ని అద్దంలోకి చూసుకుంది. తృప్తిగానేవుంది అలంకరణ. ఫారెన్ జార్జెట్ చీరె అదే కలర్ టూబై టూ జాకెట్, మెడలో ఒంటిపేట ముత్యాల హారం అవే గాజులూ ముత్యంవున్న ఉంగరం పెట్టుకుంది. తలలో తెల్లటి గులాబీ ఆకులతోసహా తురుముకుని ఇవతలకి రాబోతుండగా జీప్ శబ్దం అవటంతో 'అమ్మయ్య వచ్చేశాడు' అనుకుంటూ వరండాలోకివచ్చి నిల్చుంది. వరండా మెట్లకి అటూయిటూ పెట్టివున్న 'కుండీల్లో' సీజన్ ఫ్లవర్స్ అందంగా గాలికి మెల్లగా వూగుతూచూసే వాళ్ళని యిట్టే నిలబెట్టేసున్నాయి. తెల్లవీ యెర్రవీ వూదావీ కల్సివున్నాయి. రంగు రంగుల్లో. వాటిని సుతారంగా స్పర్శిస్తూ వీటికాలం కొద్దినెలలే అయినా యెంత అందంగా వుంటాయి. అనుకుంటూనే తలెత్తి కోపంగాచూస్తూ జీప్‌దిగి లోపలికి వస్తూన్న భర్తనీ అతని వెనుక మెల్లగా వస్తూన్న చంద్రనీ చూసి లోపలికి వెళ్ళింది.

మధుసూదనే చికాకుని అణుచుకుంటూ "యెలాగూ సినిమాకి టైము అయిపోయిందిగా. మరి కబురెందుకు చేశావు" అన్నాడు కుర్చీలో కూర్చుని బూటు లేసు విప్పుకుంటూ.

"సినిమా లేకుంటే షికారుకు పోదాం" అంటూన్న భార్య ముఖంలోకి ఓసారి తీక్షణంగా చూసి అంతలోనే తనని తాను సంబాళించుకుని "సరే, టీయివ్వు" అన్నాడు.

'చంద్ర' వెళ్ళిపోయినది చూసి "ఆ అబ్బాయి చాలా బుద్ధిమంతుడులా వున్నాడు కదూ" అంది టిఫెను ప్లేటు అందిస్తూ.

"నీలానే అతనికీ కొన్ని వ్యసనాలున్నాయట. బహుశా అందుకే నచ్చినట్లున్నాడు."

"వ్యసనాలా! నాకా! ఏమిటి మీ రనేది!" తనూజ ముఖం గంటుపెట్టుకుని అంది.

"అబ్బ! రాణిగార్కి అప్పుడే కోపం వచ్చిందా! మరేం కాదు, వ్యసనం అంటే మానలేనిది అని నా అర్థం. అదియేది అయినాసరే. నాకు టెన్నిస్ వ్యసనం. నీకు కథలు రాయటం వ్యసనం. అలాగే చంద్రకూడా నీ లాంటి పేరు లేని రచయితట. యెక్కడికి వెళ్ళినా అతన్ని వెతుక్కుంటునే వస్తుందట అతని కథ. యీ విషయాలు అన్నీ అతని అర్హతలుగా కొందరు చెప్పారు. యీ ఒక్క విషయం తప్పించి మిగతా అంతా అతనిలో మంచి అలవాట్లేనుట"

"అలాగా! ఇంతకీ మీకు అతన్ని గురించి యింత వివరాలు తెల్సుకోవల్సిన తీరుబడీ కుతూహలం యెలా కల్గిందబ్బా."

"అతని ముఖంలో ఓ ప్రత్యేకత కన్పించటం మొదటి కారణం. రెండోది కష్టపడి ఉద్యోగంచేస్తూ ప్రైవేటుగా పై చదువులకి పరీక్షలకి కూర్చోవటం వగైరా. అందులో అతి సామాన్య సంసారంలో వాడుట కూడా."

తనూజ వింటూనే వుంది. కానీ మనస్సు యేదేదో ఆలోచించేస్తోంది. 'చంద్ర' అంటే ఓ విధమైన అభిమానం వచ్చేసింది. ఇరవైయేళ్ళ కుర్రాడు, యింకా బాల్య చిహ్నాలు పోనట్లున్న ఆ ముఖం మరీమరీనచ్చింది తనూజకి. ఔనూ ఇంత చిన్న కుర్రాడు యేంకథలు రాస్తాడు. చందమామకి పిల్లలకథలా? లేక పేదవాళ్ల ఆకలి కథలా! లేక భాగ్యవంతుల అహం భావాన్ని అధికారుల అక్రమాల్ని కథలుగాచిత్రిస్తాడా! యేమో" ఆలోచనల్లో యింకా తేలిపోతూనేవుంది తనూజ.

'నేనురెడీ' అంటూన్న భర్తమాటకి ఆలోచనలు కట్టిపెట్టి అతని వెంట చెప్పులు వేసుకునిఇల్లు నౌకర్లకి వదిలి అలాషికారుకి బయలుదేరింది తనూజ. మధుసూదన్ తన ఆఫీసు విషయాలేం చెప్పతుయేదైనా ప్రత్యేకమైన విషయం జరిగితేనేగానీకబుర్లు చెప్పు. నాకిలావిశ్శబ్దంగా నడవటం అంటే వళ్ళుమంట. విసుగ్గా 'అన్నాడు. కానీ తనూజ గుబురుగా పెరిగిన చెట్లనీ; యేవో పేర్లు తెలియని ఎర్రపూవులనీ అలా చూస్తూ పరవశురాలై భర్త విసుగుకి యీ లోకంలోకి వచ్చింది.

"ఆ పూవులపేరు చెప్పండి" అంది గుత్తులుగా విరగపూసిన వాటిని చూపిస్తూ 'తెలియదు' యిక వెళ్ళిపోదాం. చీకటి కూడా పడింది. అనటంతో యింక వెనక్కి తిరగక తప్పలేదు తనూజకి.

"వెధవ షికారు అంటూ నా టెన్నిస్ మాచ్ చెడగొట్టావు" అంటూనే

వున్నాడు మధుసూదన్.

"యంత్రాల మధ్యలో వుండి యంత్రంలా మారిపోతున్నాడు యీనాటి మానవుడు. యింక మీలాంటి మహానుభావులు యెందరున్నారో మన దేశంలో" అంటూంటే విరగబడి నవ్వి.

"తనూ లాభం లేదు. పిల్లలు కావాలోయ్‌నాకు. నీ వింక నా మాటకి తల వూపక తప్పదు" అంటూ దగ్గరకి తీసుకున్నాడు. అంతక్రితం భర్తమీద ఏర్పర్చుకున్న కోపం యెక్కడికి పోయిందో తనూజ అతని ఆలింగనంలో సర్వం మరిచిపోయింది.

## 3

చంద్రని తనే పలకరిస్తూ ఏవేవో కబుర్లు చెప్తూ అతి సన్నిహితంగా మాట్లాడటంతో సంకోచం వదిలి బాగా కబుర్లు చెప్తున్నాడు తనూజతో. ఆ ఇద్దరూ ప్రతి సాయంకాలం దాదాపు ఓ గంటసేపన్నా సాహిత్యచర్చ చేస్తూ వుండటం బాగా అలవాటు అయిపోయింది. తనకి నచ్చిన రచయితలూ రచయిత్రులూ గురించి చంద్రం చెప్తే తన యిష్టా యిష్టాలు చెప్తుంది. తనూజ కొన్నింటిలో ఇద్దరికీ ఏకాభిప్రాయం లేకున్నా తనూజ చంద్రని కించపరచదు. అందుకు చాలా తృప్తి పడిపోతాడు చంద్రం.

తను రాయాలనుకున్న కథల విషయాలు చంద్రతో చర్చిస్తుంది తనూజ ఆయితే భర్తకి మాత్రం తను కథలు రాయటం ఇష్టలేదని అర్థం చేసుకుంది. ఎందుకు యిష్టంలేదని నిలదీసి అడిగింది కూడా. మధుసూదన్. "నీకు తెలియదు తనూజా రచయిత్రుల కథలనీ నవలలనీ చదివి అవి వాళ్ల వ్యక్తిగత విషయాలు అయివుంటాయని పాఠకులు రకరకాలుగావిమర్శించుకుంటూ వుంటారు. ఆ విమర్శ సరైనదికాదు అని నాకు తెల్సినా నీవు ఓ బాధ్యతగల ఆఫీసర్ భార్యవి అలా విమర్శలకి గురికావటం నేను సహించలేను అంతే" ఖచ్చితంగా చెప్పేశాడు.

ఆఫీసర్ భార్య అయితే మాత్రం అనుకుంది. అయినా కథలు రాయాలనే ఆసక్తిని అదుపు చేసుకోలేక కథలు పత్రికలకి పంపిస్తూనే వుంది. ఆయనకి యిష్టంలేని పనిచేస్తూన్నానే అని అనుకుంటూనే.

## 4

రాత్రి తొమ్మిది గంటలయింది. ఉదయం క్యాంపుకి వెడుతూ సాయంకాలానికి వచ్చేస్తాను అని చెప్పాడు మధుసూదన్. అయినా యింకా రాలేదు. వంటకాలన్నీ చల్లారిపోతూన్నాయి. ప్రొద్దున ఒక్కర్తీ భోజనం చేయాలంటే యేదోలా వుండి అర్థాకలితోనే లేచింది. ఆకలి మండిపోతోంది. అయినా

భర్త రాకకోసం యెదురు చూస్తోంది. యీ రోజు 'చంద్ర' రాలేదు యెందుకో. సామాన్యంగా మానదే అనుకుంది. మధ్యాన్నం ఓ నలభై యేళ్ళ ముసలాయన చంద్ర తండ్రిని అమ్మగారూ అంటూ పెరట్లో కాసినాయి అని కాసిని వంకాయలూ కాకరకాయలూ తెచ్చియిచ్చి వెళ్ళిపోయాడు. చంద్ర కుటుంబ పరిస్థితి యేం బాగా లేనట్లు చంద్ర తండ్రి బట్టలు చెప్తున్నాయి.

వారం క్రితం ఓ రోజు చంద్ర కబుర్లు చెప్పి వెళ్ళిపోతూనే మళ్ళీ వెనక్కి వచ్చి బిడియంగా ముఖం దించుకుని

"అమ్మగారూ రెండు రూపాయలు కావాలి" అన్నాడు. అతను అడిగిన తీరునిబట్టి ఈ మాట అడగాలని అతను చాలారోజులుగా అడగలేక వెళ్ళినట్లు గ్రహించేసింది తనూజ.

"ఓ ఇంతేకదూ" అనేసి బీరువా తెరిచి తెచ్చి యిచ్చేసింది.

"ఎందుకని అడగరేం?" అన్నాడు జేబులో పెట్టుకుంటూ.

"చెప్పే విషయం అయితే నువ్వే చెప్తావు కదూ అని" నవ్వేసింది.

"ఇప్పుడు కాదు కానీ తర్వాత తప్పక చెప్తాను అమ్మగారూ" అంటూ వెళ్ళిపోయాడు. ఎందుకై వుంటుంది అని ఆలోచించింది. ఆర్థిక ఇబ్బందుల్లో ఏదో కారణం అయి వుండచ్చు అనేసి ఆ విషయం మర్చిపోయింది.

తనూజ ఆలోచనలు ఆపేసి ఫిడేలు తీసుకుని తనకి యిష్టమైన రెండు కృతులు వాయించుకుంది. అదీ ప్రక్కన పెట్టి రేడియో పెట్టుకుంది. పాకీజాలోని పాటలు 'లతా' గొంతులో అతి మధురంగా వినిపిస్తోంటే తన్మయురాలై వింటూ భర్త రావటంగానీ నౌఖరు తలుపు తీయటంగానీ గుర్తించలేదు.

"తనూ అప్పుడే నిద్రా? భోజనం చెయ్యకపోయావా"

గబగబా మాట్లాడేస్తూ వచ్చేశాడు. బట్టలు మార్చుకుంటూనే కబుర్లు మొదలెట్టాడు.

"అన్నట్లు యివాళ ఆఫీసులో ఏమైందనుకున్నావ్. నేను లేకుంటే పనులు మాని కబుర్లు దంచేస్తారుగా అందరూ. నేను అంత త్వరగా తిరిగిరాను అనుకున్నారు. ఒకటే గోల. కారణం యేమంటే, చంద్ర కథ ఒకటి తిరిగి వచ్చిందిట. అది ఆఫీసులోవాళ్ళు ఎవరో చూశారు. కవరు చించి కథ చదివి పగలబడి నవ్వుతూ, చంద్రని వెక్కిరిస్తూ, ఆ డైలాగ్సులను మళ్ళీ మళ్ళీ అంటూ చేసే అల్లరి పరాకష్ఠాయి చేరేసరికి వాళ్ళ బుద్ధులు వెర్రితలలు వేశాయి. ఇంత 'ఇంక్' తీసుకుని చంద్ర ముఖానా, చేతులమీదా రచయిత అనీ, వర్ధమాన రచయిత అనీ, కుర్ర రచయిత అనీ, సినీమా రచయిత అనీ రాసేస్తూ షర్టు,

ఫాంటూ కూడా ఇంక్ చేసేశారు. పాపం చంద్ర గింజుకుంటూన్నా వదలక పది మంది పట్టుకుని అతన్ని అల్లరి పట్టించారు. పరిహాస దృష్టి అట. అప్పుడే సరీగా నేను వెళ్ళాను. అందరూ హడలిపోయి అలాగే నిల్చిపోయారు చంద్ర ముఖం అవమానంతో వంగిపోయింది. ఆ సమయంలో అతన్ని అలా చూస్తూంటే చాలా జాలి వేసింది. నా వళ్ళు మండి అందరినీకస్సి తిట్టేశాను. చదువుకున్న వీళ్ళలో యింత పశుత్వం యెలా వుందో ! రాస్కెల్స్ చంద్రని ఇంటికి వెళ్ళిపోమని పంపేశాను. అసలు అప్పుడు నేను అక్కడికి వెళ్ళకుంటే అతన్ని యేం చేసేవాళ్ళో యింకాఛీ ఛీ పాపం చంద్ర చాలామంచి కుర్రాడు."

మధుసూదన్ యింకా చెప్తూనే వున్నాడు. తనూజ కిటికీ చువ్వలు పట్టుకుని ఆకాశంలోకి చూస్తోంది. కానీ సిరా ముఖంలో వున్న చంద్రముఖం కన్పిస్తూన్నట్టే వుంది. ఆవేశం పొంగుకొస్తోంది. అసలావార్త తనకి గనుక తెలిస్తే ఆ క్షణంలో అక్కడికివెళ్ళి చంద్ర ముఖాన సిరాపులిమిన వెధవలని హంటర్‌తో బాది పారేసేది, తర్వాత యేం జరిగినా సరే. ఇంత అవమానం పాపం అతను యెలా భరించగలిగాడో అన్న ఆలోచనలో ఆ రాత్రి అసలు అన్నం గొంతు దిగలేదు తనూజకి. ఆ రాత్రి అంతా నిదురేలేదు. అశాంతిగానే తెల్లవారింది. కానీ మధుసూదన్ హాయిగా నిద్రపోయాడు.

చంద్ర వస్తాడా ! అని యెదురు చూసింది. కానీ రాలేదు. అదోలావుంది. తనూజకి అసలే ఈ మధ్య ఏం బాగా లేదు. నెలతప్పిందనే అనుమానం కూడా కల్గుతోంది. లేడీ డాక్టర్‌కి చూపించుకోవాలి అనుకుంది తనూజ.


## 5

మధుసూదన్‌కి ఓ రోజు క్లబ్బులో గుసగుసలు విన్పించాయి. ఇతని భార్య కూడా "కథలు రాస్తుందట" అని ఒకరు అంటే, "అవి భద్రంగా తిరిగి వస్తాయట కూడా" అని మరొకరు అంటున్నారు.

"ఛీ ! ఎంత అవమానం !" ఒక గొంతు.

"అవమానం అనుకుంటే యెలా ? మొదట యివన్నీ భరిస్తే, సినీమా రచయిత్రి అయితే వేలు వస్తాయని ఆశ ప్రతి ఆడదానికి" అంటున్నదో మృగం లాంటి రెండుకాళ్ళ జంతువు గొంతు. ఇది విన్న నలుగురు విరగబడి నవ్వటమూ విన్పించి మధుసూదన్‌కి అవమానం అయిపోయింది.

"నేను సంపాదించలేనంత వెధవని కాను. నాభార్య కథలతో వచ్చే డబ్బుతో బ్రతకాలన్న కోరిక లేదు" అని వాళ్ళ




షర్టు పట్టుకుని గుంజి చెప్పాలనిపించింది. కానీ ఆవేశాన్ని అతి కష్టంమీద నిగ్రహించుకున్నా ఆ విసురులో ఇంటికి వచ్చేశాడు.

"తనూ....తనూజా" అంటూ అసలే యీమధ్య మధుసూదన్‌కి పార్టీల్లో 'డ్రింక్' తీసుకోవటం అలవాటైంది. అది క్రమంగా మామూలు అయిపోయింది. అంతక్రితం పార్టీ పూర్తి చేసుకునే క్లబ్‌కి వచ్చినవాడు యీ మాటలు విని మండిపోతూ ఇల్లుచేరి భార్యకోసం మేడపైకి వెళ్ళాడు. తనూజ తన కథని నీట్‌గా కాపీ చేస్తోంది. కోటు సోఫామీద గిరాట్టుకొట్టి నెక్'టై' బట్టల స్టాండుపైన గిరాట్టుకొట్టి టేబుల్ లైటు ముందు కూర్చొన్న తనూజ దగ్గరికివచ్చి వరుసగా పెట్టివున్న కాయితాలని విసురుగాలాగి విసిరికొట్టి "ఛీ నీకు సిగ్గులేదూ! వద్దు అన్నపని యెందుకు చేస్తావు! నలుగురిలో నాకెంత అవమానం జరిగిందో తెల్సునా" యెర్రగా వున్న అతని కళ్ళు మరీ యెర్రగా అయిపోతూన్నది చూసి తనూజ తెల్లబోయి అలాగే కూర్చుంది. క్లబ్‌లో జరిగిన విషయం చెప్పి "ఆఖరివార్నింగ్ గుర్తుంచుకో యిలా మళ్ళీ జరిగిందా నేను అసలు మంచివాడినికాను" విసురుగా అక్కడనుంచి వెళ్ళిపోయాడు.

తనూజ ఆత్మాభిమానం దెబ్బతిన్నది. కన్నీళ్ళు జలజలా రాలుతున్నాయి. అలాగే కూర్చుంది. ఆ రాత్రి భార్యాభర్తలు భోజనం చెయ్యలేదు. కానీ తెల్లవారి మధుసూదన్ "సారీ తనూజా" అనేసి ఆఫీసుకి వెళ్ళినా

తనూజకి శాంతి లేదు. ఛీ మరెప్పుడూ రాయను. అనుకుని సగం సగం రాసినకథల కాయితాలన్నీ నౌకరు కిచ్చి. సాంబయ్యా అవన్నీ తోటలో పడేసి నిప్పుపెట్టేసెయ్యి" అనేసి వులికివచ్చే దుఃఖాన్ని ఆపుకుంటూ మేడపైకి వెళ్ళి మంచంమీద వాలిపోయింది. గుండెలు పిండేసే బాధతో. యెన్నో ఆశయాలనీ ఆదర్శాలనీ రంగరించి సృష్టికి ప్రతిష్ఠ చేయాలని చేసినతనప్రయత్నానికి పురిటి లోనే 'సంధి' కొట్టింది. అందుకే అంత కఠినంగా అనుజ్ఞ యిచ్చింది.

పావుగంట తర్వాత నౌకరు గది వాకిలి దగ్గర నిల్చి "అమ్మగారూ చంద్రుడు మీ కోసం నిల్చున్నాడు. ఓ మాట చెప్పాలట" అనటంలో యెంత వోపికలేకున్నా మెల్లగాలేచి క్రిందకి వచ్చింది. యెప్పుడూ నవ్వుతూ వుండే చంద్రుడి ముఖం యివాళ గంభీరంగా వుంది అతని చేతిలో తన కథలకాలూకు కాయితాలు బొత్తిగా పేర్చుకుని అపురూప వస్తువు అన్నట్లు పట్టుకున్నాడు.

"అమ్మగారూ యిది యిది ... యేం చేశాయని అంత కఠినంగా అగ్ని....కి ఆహుతి యిమ్మన్నారు" అతని కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి. "చంద్రా" పమిటి కొంగు నోట్లో కుక్కుకుంది తనూజ.

"అమ్మగారూ మీరు సరే నంటే నేనివి తీసుకుంటాను"

"అవి నీకు కావాలా చంద్రా."


"ఔను..."

"తీసుకు వెళ్ళిపో... కానీ...నా పేరు వద్దు" అంటూనే పైకి గబగబా వెళ్ళి పోయింది. అంత దుఃఖంలోనూ కాస్త ఓదార్పు కలిగినట్లుంది తృప్తిగా వూపిరి తీసుకుని కన్నీళ్ళు తుడుచుకుందితనూజ.

## 6

కొన్ని రోజులు ప్రశాంతంగా గడిచి పో యా యి. మధుసూదన్ క్యాంపు వెళ్ళాడు. నౌకరు సాంబయ్య చెప్పాడు" "చంద్రుడికి వారంనుంచీ జొరం అమ్మ గారూ" అని అయ్యో అలాగా అందు కేనా రావటంలేదు" అంది. తనూజకి మూడవనెల అన్నం సయించకపోతే చింతకాయలు తింటూ కూర్చుంది మేడ మీది బాల్కనీలో. ఆలోచనలు ఎటేటో పోతున్నాయి. కాత్యాయిని దగ్గరనుంచి వుత్తరం వచ్చింది ఆ క్రితం రోజున. అదే వళ్ళీ మళ్ళీ చదువుకున్నది. మధు సూదన్ ఇవాళ వస్తానని చెప్పాడు. యే జీపు శబ్దం విన్పించినా ఆయనే నేమో అని చూస్తోంది వాకిలివైపు

"అమ్మగారూ అమ్మ గారూ" చంద్ర గొంతు విని వులిక్కిపడి వెనక్కి తిరిగి ఆశ్చర్యంగా చూసింది అతనివైపు. జ్వరంతో నీరసపడిపోయినా అంతశక్తి యెలా వచ్చిందో చంద్రకి నడుస్తు న్నట్లు కాక గాలిలో తేలిపోతూ వచ్చి




నట్లుగా అన్పిస్తున్నాడు. మాసిన గడ్డం గుంటలుపడిన కళ్లు శక్తినంతా కూడ దీసుకున్నట్లున్న అతన్ని చూస్తూంటే తనూజకి తెలియకుండానే ఆత్మీయత పొంగుకొచ్చేసింది.

"చంద్రా" అంది గభాలున లేచి. అతను మెట్లెక్కి పైకివచ్చిన ఆయాసం తీర్చుకుంటూ .... "మన .... కథకి.... పోటీలో... ఫస్టుప్రైజు... వచ్చింది అమ్మగారూ...." ఒక్కొ అక్షరం వత్తి పలుకుతూంటే–

"మన కథకి....ప్రైజా....అంటే?"

"అదేనమ్మా.... మీరు .... సగం... రాసి వదిలిన కథ....నేను పూర్తిచేసి..." అంటూండగానే మెట్లక్రిందనుంచి మధుసూదన్ గొంతు విన్పించింది"తనూజా, యెక్కడా" అంటూ. తనూజ గాభరా పడిపోయింది. భర్తకి యితనితో యిలా చనువుగా మాట్లాడటం యిష్టంలేదు. అన్న విషయం బాగాతెల్సు. కానీ యింత సంతోష వార్త తెచ్చిన చంద్రని వెళ్ళిపొమ్మని యెలా అనటం. అతనితో యింకా యేవో కబుర్లు చెప్పాలన్పిస్తోన్నా .. "చంద్రా కంగ్రాచ్యులేషన్స్‌!

"కానీ అది మన కథ కాదు....నీ కథ అంతే, అలా అంటేనే నాకుసంతోషం" కాదు....నాది కాదు........ అది మీదే అమ్మాగారూ" అంటూనే మెట్లెక్కి పైకి వచ్చి యజమానిని చూస్తూనే భయపడిపోయి కాళ్లు వణుకుతూంటే నిలబడలేక కళ్ళు తిరిగినట్లు అయి క్రిందకి పడిపోవటంతో దొర్లిపోతూ వుంటే.

మధుసూదన్ "అరె....చంద్రా యిప్పుడు యిక్కడకి ఎందుకున్నాడు ! అనలేం చేస్తున్నాడు." అంటూనే వంగిఅమాంతం పట్టుకోకుంటే ఆఖరి మెట్లుమీదికి వెళ్ళిపోయేవాడు.

మధుసూదన్ గొంతు విం టూ నే నౌకర్లు పరుగునవచ్చి చంద్రని చేతుల్లోకి తీసుకున్నారు. తనూజకి నోట మాటే రావటంలేదు. స్థాణువులా నిల్చిపోయింది భర్తవైపు చూసే ధైర్యం లేనిదానిలా :

"చంద్ర.... అయ్యో చంద్రుడు" పనివాళ్లు గాబరా పడుతూన్నారు. మధుసూదన్ చంద్ర గు ప్పె ట్లో వు న్న టెలిగ్రాం కాగితంతీసి యిదేమిటి : అని లోలోపల చదువుకుని "తనూజా" అన్నాడు భార్యవైపు చూస్తూ.

"ఆ" అస్పష్టంగా పల్కిందే కానీ చంద్రమీదే వుంది ఆమె దృష్టి.

"ఏమిటీ, చ ం ద్ర "పారితోషికం" కథకి ఫస్టుప్రైజా" అంటూనే భార్య ముఖంలోకి చూశాడు.

"అమ్మగారూ, చంద్రుడు మాటాడటంలేదు" అన్న మాట విని గబగబా మెట్లుదిగి వెళ్ళి "చంద్రా...." అంది ముఖంమీద చల్లటి నీళ్లు కొడుతూ.

మధుసూదన్ టెలిగ్రాం కాయితం పట్టుకునే టెలిఫోన్ చేసి డాక్టర్ని అర్జంటుగా రమ్మన్న మాట విని "అబ్బ, యెంత మంచివారు" అనుకుంది తృప్తిగా భర్తని చూసుకుని. కానీ చంద్రుడు హీనస్వరంతో అంటున్నాడు "ఆ కథ మీదే అమ్మగారూ...."

తనూజకి కన్నీళ్ళు తిరుగుతూంటే టెలిగ్రాం మళ్ళీ మళ్ళీ చదువుకుని "నిజంగా ఆ కథ నాదే కావచ్చు కానీ, అది నీ మనస్సులోనే దాచుకో" అంటూ డాక్టర్ వచ్చేవరకూ అతని దగ్గరే వుండిపోయింది.

చంద్రకి జరగబోయే సత్కారాలూ అభినందనలూ వూహించుకుంటూ అంతక్రితం చంద్ర సాటి స్నేహితుల చేత అవమానించబడిన విషయం గుర్తు తెచ్చుకుంటూ నేను పిరికిదాన్ని చంద్రా కనుకనే మధ్యలోనే ఆగిపోయింది. నువ్వు నీ ఆశయాన్ని కొంత వరకైనా సాధించు....మంచి కథలని పాఠకులకి అందించు.

భగవాన్ యీ చంద్రని రక్షించు అనుకుంది మనస్సులో, "డాక్టర్ వచ్చారమ్మగారూ" అన్న పనిమనిషి పిలుపుకి యీ ప్రపంచంలోకి వస్తూ,

మధుసూదన్ డాక్టర్‌తో అంటూన్నాడు. "చంద్రకి మరేం ఫర్లేదుకదూ డాక్టర్."

"ఏం భయంలేదు" అన్న మాటవిని తనూజ "అమ్మయ్య" అనుకుంది.

●